క్లుప్తంగా

నేటినుంచి ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు

బోడుప్పల్: పన్నాల రవీందర్‌రెడ్డి కాలనీలోని శ్రీకృష్ణ దేవాలయం ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలను ఈ నెల 7వ తేదీ నుంచి 12వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ పన్నాల కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 7వ తేదీన అభిషేకం, శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, 8వ తేదీన ధ్వజారోహణం, సామూహిక లక్ష్మి కుంకుమార్చన, 9వ తేదీన శ్రీవిద్యా హయగ్రీవ హోమం, 10వ తేదీన కళ్యాణోత్సవం, అన్నదానం, ఊరేగింపు, 11వ తేదీన సుదర్శన నారసింహా హోమం, 12వ తేదీన మహా పూర్ణాహుతి, మహా కుంభ ప్రోక్షణ, 108 కళశాలతో అభిషేకం, చక్రస్నానం, పుష్పయాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



సీఎం రిలీఫ్ చెక్కును అందజేస్తున్న సంజీవ్‌రెడ్డి

బోడుప్పల్: 26వ డివిజన్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న దత్తాద్రికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బోడుప్పల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి చేతులమీదగా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. రూ.32.50 వేల చెక్కును అందజేసినట్లు వెల్లడించారు. 26వ డివిజన్ పార్టీ ఇన్‌చార్జి రాసాల మహేష్‌యాదవ్, నాయకులు మోతే రాజు తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరిస్తా



శ్రీకృష్ణనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్

మల్కాజిగిరి: శ్రీకృష్ణానగర్ కాలనీలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. కాలనీలో సోమవారం ఆయన పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లకు మరమ్మతులు, మ్యాన్‌హోల్స్ మరమ్మతులు, వీధి నంబర్–10లో కలుషిత తాగునీరు సరఫరా అవుతోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు కోవాలని అధికారులకు సూచించామన్నారు.

అభినందనలు



మార్కెట్ యార్డ్ చైర్మన్‌తో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన హరిక ఆనంద్‌బాబును మల్కాజిగిరి కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. నూతన చైర్మన్‌గా మార్కెట్‌లో వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారనే నమ్మకం ఉందన్నారు.

జాతీయ అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబర్చిన డేవిడ్‌రాజు



అల్వాల్: గచ్చిబౌలి బాలయోగి స్టేడియంలో నిర్వహించిన జాతీయ అథ్లెటిక్స్‌లో మూడు విభాగాల్లో సైనిక్‌పురికి చెందిన పల్లపు డేవిడ్ రాజు ప్రతిభ కనబర్చారు. 47 కిలోల షాట్‌పుట్‌లో మూడో స్థానం, డిస్కస్ త్రోలో మూడో స్థానం, హ్యామర్ త్రోలో రెండో స్థానం లభించింది. సౌత్ కొరియాలో జరిగే అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలో పాల్గొనేందుకు అర్హత సంపాదించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి



మేడిపల్లి: కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగును ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి అన్నారు. 16, 10వ డివిజన్‌లో శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. డాక్టర్ పి.రామకృష్ణారావు, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, కార్పొరేటర్లు బండి రమ్య సతీష్‌గౌడ్, వీరమళ్ల సుమలత, బచ్చరాజు, నాయకులు బండి సతీష్ గౌడ్, వీరమళ సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జానకి, చందన, కళ్యాని తదితరులు ఉన్నారు.



అలా.. ఇలా..

రాష్ట్ర బడ్జెట్‌పై భిన్నవాదనలు | సమ ప్రాధాన్యమని కొందరు.. | ఎన్నికల కోసమని మరికొందరు..

కాప్రా: తెలంగాణ వార్షిక బడ్జెట్‌పై భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీష్ రావు సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌పై ఎవరి వాదనలు వారు వినిపిస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకొని సమపాళ్లలో నిధులు కేటాయిస్తూ సమప్రాధాన్యం ఇచ్చారని కొందరు, కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని ఇంకొందరు, హామీలే తప్ప అమలు మాత్రం లేదని మరికొందరు తమ అభిప్రాయాలను చెప్పారు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపు బాగానే ఉన్నా అందుకు అనుగుణంగా కేటాయింపులు చేస్తూ ఇచ్చిన హామీలు అమలు చేస్తారా లేదా అనేది చూడాలని మరికొందరు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఏ బడ్జెట్‌లో అయినా నిధుల కేటాయింపు బాగానే ఉన్నా కనీస జీతభత్యాలు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొందని, విద్యా పరంగా పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని మరికొందరు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బడ్జెట్ ప్రజల్లో ఆశలు రేకెత్తిస్తున్నా క్షేత్రస్థాయిలో పేదలకు చేరుతాయా లేదా? అనే అనుమానాలు వినిపిస్తున్నాయి.

దృష్టంతా ఎన్నికలపైనే..



రాష్ట్ర బడ్జెట్ పూర్తిగా ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రూపొందించినట్లు ఉంది. అసలు బడ్జెట్‌లో సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారు. రుణాలు మాఫీ కాకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దళితబంధు మాదిరిగా గిరిజన బంధు ఉంటుందని ఆశించాం.., కానీ ప్రభుత్వం ఆ వైపు ఆలోచన కూడా చేయలేదు. నిరుద్యోగ భృతి ప్రస్తావనే లేదు. రాష్ట్రంలో బీఆర్ఎస్, కేంద్రంలో బీజేపీ ఇద్దరూ ఇద్దరే. మొన్నటి కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణను పూర్తిగా విస్మరించడానికి రాష్ట్ర ప్రభుత్వం కారణం.

– సింగిరెడ్డి శిరీషరెడ్డి, కార్పొరేటర్

సమ ప్రాధాన్యతతో బడ్జెట్



అన్ని వర్గాల ప్రజలకు ప్రాధాన్యం కల్పిస్తూ నిధులు కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యం ఇస్తోందని బడ్జెట్‌లో మరోసారి నిరూపించుకుంది. యూనివర్సిటీల వసతి, మరమ్మతులకు నిధుల కేటాయింపు హర్షించదగిన విషయం. ఉద్యోగ నియామకాల కోసం అదనంగా నిధులు కేటాయించడం ఉపాధి కల్పన పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి మరోసారి రుజువైంది. పల్లె, పట్టణ ప్రగతి నిధులు మున్సిపాల్టీలు, గ్రామ పంచాయతీలకు జమ చేయడం అభివృద్ధికి నిదర్శనం.

– స్వర్ణరాజ్ శివమణి, కార్పొరేటర్.

బడ్జెట్ నిరాశపర్చింది



నిరుద్యోగ యువతను మరోసారి నిరాశపర్చింది. ఉద్యోగావకాశాలు కల్పిస్తామంటున్నారు కానీ నిధుల కేటాయింపు మాత్రం లేదు. బడ్జెట్‌లో వెయ్యి కోట్లు మాత్రమే కేటాయించడం ఎంత వరకు సమంజసం. ఎన్నికల సమయంలో నిరుద్యోగ భృతి హామీ బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. మరోసారి నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం మొండి చేయి చూపింది. స్వయం ఉపాధి వైపు ఆలోచనే లేదు. ఉపాధి అవకాశాల పేరెత్తలేదు. మరోసారి ఓసీల్లోని పేదలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది.

– జైని రాజేశ్వర్‌గుప్తా, సామాజికవేత్త.

ప్రభుత్వంపై ప్రజలకు ఆశ లేదు



రాష్ట్రంలో అణగారిన వర్గాలను ప్రోత్సహిస్తుందని ఎదురుచూసిన వారి ఆశలు అడియాశలయ్యాయి. కేసీఆర్ పాలనలో అణగారినవర్గాలు మరింత అణిచివేతకు గురయ్యాయి. కేసీఆర్ నోట ఎప్పుడూ వచ్చే మాటలే బడ్జెట్‌లో అన్ని అబద్ధాలు చెప్పారు. ఈ బడ్జెట్ పూర్తిగా జీరో బడ్జెట్‌లా భావిస్తున్నా, ఇచ్చేది ఏమీ ఉండదు. ఎన్నికలు వస్తున్నాయని మరోసారి ప్రజలను మోసం చేసేందుకు అంకెల గారడికి మరోసారి శ్రీకారం చుట్టారు. కేసీఆర్ మాటలు కోటలు దాటేలా ఉంటాయి.. చేతలు గడప దాటవు.

– సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి, ఉప్పల్ బీబ్లాక్ అధ్యక్షుడు.

అప్పుల ఊబిలో కాంట్రాక్టర్లు



అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లు ఇబ్బందులకు గురవుతున్నారు. కనీసం ఈఎండీలు, ఆర్ఎండీలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. కాంట్రాక్టర్ల దరావత్తు సొమ్ము కూడా రాలేని పరిస్థితి ఉంది. అప్పులు చేసి అభివృద్ధి పనులు చేయడంతో కాంట్రాక్టర్లు తెచ్చిన సొమ్ముకు వడ్డీలు చెల్లించలేకపోతున్నారు. రోజురోజుకూ కాంట్రాక్టర్లు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఇటు కాంట్రాక్టర్లకే కాదు అటు యువతకు బడ్జెట్‌లో కేటాయింపులు శూన్యంగానే కనిపిస్తోంది.

– నాగిరెడ్డి సంజీవరెడ్డి, హైదరాబాద్ జిందాబాద్ ఉపాధ్యక్షుడు.



అసెంబ్లీలో బడ్జెట్ ప్రసంగాన్ని వింటున్న ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



9వ తేదీన జరిగే తన కుమారుడు సుమంత్‌రెడ్డి పెళ్లికి హాజరు కావాలని కోరుతూ పెళ్లి పత్రికను అసెంబ్లీ కార్యదర్శి డా.నరసింహాచార్యులుకు అందజేస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన పలువురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను తన క్యాంపు కార్యాలయంలో అందజేస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

మల్లాపూర్: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందిన ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాచారం ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రం నుంచి మల్లాపూర్‌కు వచ్చి మల్లాపూర్ గోకుల్‌నగర్‌లో కేజీఎన్ టైర్ పంక్చర్ షాపులో ఎండీ అషఫగ్(19) ఎండీ షర్ఫ్రుద్దీన్(20) పని చేస్తున్నారు. ఆదివారం రాత్రి ద్విచక్రవాహనంపై షాపునకు వెళ్తుండగా ఎఫ్‌సీఐ గోడౌన్ ములమాలపు వద్ద రోడ్డుపై ఆగిఉన్న భారత్ పెట్రోలియం ట్యాంకర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టారు. దీంతో బైక్ నడుపుతున్న ఎండీ అషఫగ్ అక్కడికక్కడే మృతి చెందాడు. షర్ఫ్రుద్దీన్‌కు స్వల్ప గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొడుకును చూసేందుకు వెళ్తూ..

మల్లాపూర్: హాస్టల్‌లో ఉన్న కొడుకును చూసేందుకు వెళ్తూ టిప్పర్ లారీ కిందపడి ఓ మహిళ మృతి చెందిన ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బాబానగర్‌కు చెందిన సుద్దాల బాలకృష్ణ, అక్క తుంగ మానస అలియస్ రజిత(40) భర్త వదిలేయడంతో కూతురు, కొడుకును హాస్టల్‌లో చదివిస్తూ తల్లిగారి ఇంట్లో బాబానగర్‌లో ఉంటోంది. భువనగిరి హాస్టల్‌లో చదువుకుంటున్న కొడుకు యశ్వంత్‌ను చూసేందుకు రజిత సోమవారం నాచారం చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా హబ్సిగూడ నుంచి వచ్చిన టిప్పర్ లారీ ఆమెను ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విశ్వకర్మ సేవా ట్రస్ట్ ఎన్నిక



రామంతాపూర్: శ్రీవిరాట్ విశ్వకర్మ సేవా ట్రస్ట్ సోమవారం నిర్వహించిన సమావేశంలో ట్రస్ట్‌కు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా పూనా సత్యనారాయణచారి, అధ్యక్షుడిగా భిక్షపతిచారి, కార్యదర్శిగా కనపర్తి రామరత్నం, కోశాధికారిగా ఆకోజు ఆంజనేయులుచారి, వైస్ చైర్మన్లుగా భీమాచారి, రామస్వామి, ఉపాధ్యక్షులుగా వెంకటేశంచారి, బాలకృష్ణచారి, సహాయ కార్యదర్శిగా శంకరాచారిని ఎన్నుకున్నారు.

రేవంత్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు



గౌతంనగర్: హాత్ సే హాత్ జోడో యాత్ర చేపట్టిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ఏఐసీసీ ఓబీసీ విభాగం మాజీ కో ఆర్డినేటర్ బి.సురేష్‌యాదవ్ కలిసి అభినందనలు తెలిపారు. డి.వెంకటేష్, యాదగిరి, లక్ష్మణ్, సురేందర్ ఉన్నారు.

కాలనీల సమస్యలు పరిష్కరిస్తా

మల్లాపూర్: నాచారం కార్తికేయనగర్ కాలనీలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీలోని సమస్యలను పరిశీలించారు. కార్తికేయనగర్ హోరేబ్ చర్చి వద్ద సీసీ రోడ్డు, వీధి నెంబర్–9, 10లో బీటీ రోడ్డుతో పాటు వర్షపు నీరు వెళ్లేందుకు వాటర్ డ్రైన్‌లైన్ ఏర్పాటు చేస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. డీఈ రూప, ఏఈ లింగారావు, వర్క్ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ముత్యంరెడ్డి, బీజేపీ నేత మల్లెల నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పేదల కష్టాలు తీరేది కాంగ్రెస్‌తోనే..



ఉప్పల్ శాంతినగర్‌లో కాంగ్రెస్ నాయకుల యాత్ర



నాచారంలో ప్రారంభిస్తున్న రాగిడి లక్ష్మారెడ్డి

ఉప్పల్: దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేదల కష్టాలు తీరుతాయని పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉప్పల్ డివిజన్‌లో సోమవారం నిర్వహించిన హాత్ సే హాత్ జోడో యాత్రకు విశేష స్పందన లభించింది. సీనియర్ కాంగ్రెస్ నాయకులు దుబ్బ నర్సింహారెడ్డి, పార్టీ జెండాను ఊపి యాత్రను ప్రారంభించారు. ఉప్పల్‌లోని శాంతినగర్‌లో ఉదయం ప్రారంభించిన యాత్రలో నాయకులు కార్యకర్తలు, గడప గడపకు వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని వారు అభిప్రాయపడ్డారు. టీపీసీసీ ప్రతినిధి మేకల శివారెడ్డి, తౌఫిక్, పసుల ప్రభాకర్‌రెడ్డి, కంది ఆగిరెడ్డి, బోరంపేట కృష్ణ, చెన్‌రెడ్డి రఘుపతిరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, కొంపల్లి బాలరాజు, రామకృష్ణ, దుర్గం నవీన్ పాల్గొన్నారు.

నాచారం డివిజన్‌లో..

మల్లాపూర్: నాచారం డివిజన్‌లో హాథ్ సే హాథ్ జోడో యాత్రను ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి నాచారంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి సోమవారం ప్రారంభించారు. నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మల్లికార్జున్‌గౌడ్, మేకల శివారెడ్డి, కృష్ణారెడ్డి, రాంరెడ్డి, భద్రయ్య, అశ్రూ, కృష్ణయాదవ్, హెచ్ఆర్.మోహన్, నవీన్‌రెడ్డి, కిరణ్ ఉన్నారు.

ఓల్డ్ మల్లాపూర్‌లో..

మల్లాపూర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఉప్పల్ నియోజకవర్గ బి బ్లాక్ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి యాత్రను ప్రారంభించారు. రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి జమీలాబేగం, మొసలి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీసెల్ కన్వీనర్ రాజు, పీజీ సుదర్శన్, నవీన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

రజక వృత్తిదారులకు ఇళ్లు, స్థలాలు కేటాయించాలి

ఉప్పల్: రజక వృత్తిదారులకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించాలని కోరుతూ సోమవారం రజక వృత్తిదారుల సంఘం మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. సంఘం నాయకులు బాలరాజ్, సదాయ్య, దుర్గయ్య, లింగం, రమేష్, భాస్కర్, జలంధర్, రవి, లక్ష్మీ, అనురాధ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రజక వృత్తిదారుల సమస్యల సాధనకు ఈనెల 9వ తేదీన ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా విజయవంతం చేయాలని కోరారు.



తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న రజక వృతిదారులు

శ్రీచైతన్య విద్యార్థులకు బంగారు పతకాలు



ట్రోఫీతో కరస్పాండెంట్ బుచ్చిరెడ్డి తదితరులు

మల్లాపూర్: హర్యానాలో జరిగిన జాతీయస్థాయి కబడ్డీ టోర్నమెంట్‌లో మల్లాపూర్ దత్తాత్రేయనగర్ శ్రీచైతన్య ఒలింపియాడ్ స్కూల్ విద్యార్థులు కవిత, ఆకాష్, కళ్యాణ్, సాయికృష్ణ విజేతలుగా నిలిచారు. ట్రోఫీతో పాటు బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. విద్యాసంస్థల చైర్మన్, పాఠశాల కరస్పాండెంట్ బుచ్చిరెడ్డి సోమవారం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సాయిరాంరెడ్డి, పీఈటీ ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

ఖోఖోలో ద్వితీయ స్థానంలో మోడ్రన్ స్కూల్...

మల్లాపూర్ సూర్యనగర్ మోడ్రన్ హైస్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో రెండో స్థానాన్ని కైవసం చేసుకున్న విద్యార్థులు మహేశ్వరీ, మేఘన, శివారెడ్డి, అక్షయ, ఈశ్వర్, జ్ఞానేశ్వరీలను ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యాప్రసాద్, ఫీట్ అండ్ ప్లే అకాడమీ ఆధ్వర్యంలో సత్కరించారు.

తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి

బోడుప్పల్: తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి ఆదేశించారు. జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి, డీజీఎం నిర్మల, మేనేజర్ మమతతో కలిసి ఆయన తాగునీటి సమస్య ఉన్న 10, 22, 24 డివిజన్‌ల్లో సోమవారం పర్యటించి తాగునీటి సమస్యను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరాలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జలమండలి అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు బొమ్మక్ బాలయ్య, గుర్రాల వెంకటేశ్‌యాదవ్, కృపాసాగర్ ముదిరాజ్ పాల్గొన్నారు.



డివిజన్‌లో పర్యటిస్తున్న మేయర్, అధికారులు

అర్హులు ఇళ్లను క్రమబద్ధీకరించుకోవాలి



వివరాలు తెలుపుతున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

అల్వాల్: మల్కాజిగిరి మండల పరిధిలో జీఓ నంబర్–59 ద్వారా ఇళ్ల క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తుల పరిశీలన పూర్తయ్యిందని తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. 732 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారిలో అర్హులైన వారికి క్రమబద్ధీకరణ కోసం చెల్లించాల్సిన రుసుం వివరాలను తెలియజేస్తూ నోటీసులు అందజేశామన్నారు. మార్చినెలలోపు రుసుం చెల్లించాలన్నారు. రుసుం మొత్తం చెల్లించిన వారికి రిజిస్ట్రేషన్, స్టాంపు డ్యూటీ లేకుండా వారి పేరుపై రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం



విక్రమ్‌గౌడ్

అల్వాల్: బడ్జెట్‌లో బీసీకు అన్యాయం జరిగిందని బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ సభ్యులు విక్రమ్‌గౌడ్ అన్నారు. రాష్ట్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేవలం 2.2 శాతం నిధులు కేటాయించారంటే బీసీల పట్ల ప్రభుత్వానికి ఉన్న ప్రేమ తెలియజేస్తుందన్నారు. బీసీల వ్యతిరేక బడ్జెట్ ప్రవేశపెట్టి బీసీ జనాభాను అవమానించారన్నారు.

కరెంటు ఉండని ప్రాంతాలు

రామంతాపూర్: విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ తీగలకు అడ్డుగా వస్తున్న చెట్ల కొమ్మలను తొలగించడంతో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీనివాస్‌పురం, రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాల, యాదయ్య హోటల్, కామాక్షిపురం, వెంకట్‌రెడ్డినగర్, వివేక్‌నగర్, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకు బాలకృష్ణనగర్, కేసీఆర్‌నగర్, సాయికృష్ణనగర్, శ్రీనగర్‌కాలనీ, శ్రీరామ కాలనీ, రామ్‌రెడ్డినగర్, వాసవీనగర్‌లో కరెంటు ఉండదని ఏఈ రాములు తెలిపారు.

ఆకస్మిక తనిఖీ



ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ ఎస్‌బీహెచ్ కాలనీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని మేడ్చల్ జిల్లా వైద్యాధికారి డా.పుట్ల శ్రీనివాస్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతిరోజూ శిబిరానికి ఎంత మంది హాజరవుతున్నారని ఆరా తీశారు. రికార్డులను సైతం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉప్పల్ వైద్యాధికారి డా.సౌందర్య లత, సూపరింటెండెంట్ ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

మైసమ్మ ఆలయ ఇన్‌చార్జిగా లక్ష్మణ్

ఉప్పల్: ఉప్పల్ బగాయత్‌లోని శ్రీబొప్పన్ చెరువు కట్ట మైసమ్మ దేవాలయం ఇన్‌చార్జిగా ఉప్పల్‌కు చెందిన కమ్మ లక్ష్మణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆలయ అర్చకులు సుమన్‌శర్మ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచెమీది శివయ్య, శామీర్‌పేట ధర్మారెడ్డి, ఉపేందర్, సంజీవరెడ్డి, రవీందర్ ముదిరాజ్, రాకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉర్సు ఉత్సవాల్లో సెహరా సమర్పణ



మౌలాలి: మౌలాలిలో జరుగుతున్న ఉర్సు ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్‌యాదవ్ దంపతులు హాజరై హజ్రత్ అలీకి సెహరా సమర్పించారు. హుస్సేన్, కమర్, ఫాతిమా, అబ్బాస్, సాదిక్, శబ్బర్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



చర్లపల్లి డివిజన్ వడ్డెర సంఘం నూతన కార్యవర్గం

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ వడ్డెర సంఘం నూతన కార్యవర్గం సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా పల్లపు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బొంత రాజు, ఉపాధ్యక్షులుగా అయిలయ్య, నందికొండ నర్సింహ, పల్లపు ప్రభాకర్, సంయుక్త కార్యదర్శులుగా బొంత ప్రశాంత్, మధు, దుర్గయ్య, రమేష్, సామెల్, కోశాధికారిగా మార్క్, సలహాదారులుగా కుంచెపు వెంకటేష్, అంజయ్య, పల్లపు మల్లేష్, పల్లపు యాదగిరి, బసవయ్య, కమిటీ సభ్యులుగా బొంత అశోక్, యాదయ్య, ఎల్లయ్య, రాజు, రాములు ఎన్నికయ్యారు.

సుకన్య సమృద్ధి యోజనను సద్వినియోగం చేసుకోండి

ఉప్పల్: సుకన్య సమృద్ధి యోజన పథకంపై ఉప్పల్ పోస్టల్ కార్యాలయం ఆధ్వర్యంలో మండే మార్కెట్‌లో సిబ్బంది పర్యటించి సోమవారం కరపత్రాలు అందజేసి అవగాహన కల్పించారు. పోస్ట్ మాస్టర్ రవీందర్ మాట్లాడుతూ ఈ నెల 9, 10వ తేదీల్లో సుకన్య సమృద్ధి యోజన పథకం కింద 10 ఏళ్లలోపు ఆడపిల్లలు ఉన్న తల్లిదండ్రులు పోస్టాఫీసులో రూ.250 చెల్లించి ఖాతాలు తెరవాలని సూచించారు. ఖాతా తెరిచిన అమ్మాయి 15 సంవత్సరాలు నిండే వరకు డబ్బులు జమ చేస్తే 21 సంవత్సరాలు నిండే వరకు ఆరేళ్ల ఏళ్ల పాటు ప్రభుత్వం డబ్బులను జమ చేసి అసలు వడ్డీ కలిపి మొత్తాన్ని అందజేస్తుందని తెలిపారు.



ఉప్పల్ మండే మార్కెట్‌లో అవగాహన కల్పిస్తున్న పోస్టల్ సిబ్బంది